# నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులు ప్రారంభం



జ్యోతినగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 4: కరీంనగర్ ప్రజలు తనకు మూడు సార్లు అవకాశం ఇచ్చారని, ఆ మేరకు అభివృద్ధి పనులు చేపట్టి నగర రూపురేఖలు మార్చామని, మరోసారి అవకాశం ఇస్తే అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక 36, 54, 55, 58, 59, 60, 30, 53వ డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. పచ్చగా ఉన్న తెలంగాణలో మళ్లీ చిచ్చురేపేందుకు గతంలోని ఆంధ్రా పాలకులు కాంగ్రెస్, బీజేపీ ముసుగులో ఓట్ల కోసం వస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సంపదను దోచుకునేందుకు వస్తున్న వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు అధికారం ఇస్తే ఢిల్లీ పాలకుల చేతిల్లోకి పోతుందన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తానన్నారు. ఇంకా వేల కోట్ల నిధులు తెచ్చి నగరాన్ని మట్టి రోడ్లు లేని నగరంగా మార్చుతానన్నారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిందని, ఏడాదిలోగా మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. దీంతో నగరానికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, వాల రమణారావు, నేతికుంట యాదయ్య, తుల శ్రీదేవి, ఆయా డివిజన్ల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర ప్రభుత్వం యువత, విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు, వాటిలో రాణించేలా ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగరంలో అన్ని డివిజన్లలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు అవసరమైన క్రీడా కిట్లను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి మంత్రి క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో క్రీడలను ప్రోత్సహించాలన్న ఆలోచనతోనే సీఎం కేసీఆర్ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారన్నారు. నగరంలోని 60 డివిజన్లలో రెండు చొప్పున వందకు పైగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు, క్రీడా సంఘాల నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని 34వ డివిజన్‌లో యువకుడికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్



కశ్మీర్‌గడ్డలో బీజేవైఎం నాయకుడు ఈసరి జశ్వంత్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం కల్పిస్తాం

కార్పొరేషన్, అక్టోబర్ 4: బీఆర్ఎస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి కాపాడుకుంటామని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక కశ్మీర్‌గడ్డలో బీజేవైఎం నాయకుడు ఈసరి జశ్వంత్ ఆధ్వర్యంలో 20 మందికిపైగా యువకులు మంత్రి గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చిన వారికి, ప్రస్తుతం పార్టీలో ఉన్న వారిని సమన్వయం చేసుకొని మంచి భవిష్యత్ కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి యువత పార్టీలోకి రావడం అభినందనీయమన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ తుల శ్రీదేవి-చంద్రమౌళి, నాయకులు అంజాద్, చందు, అంజన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్, అక్టోబర్ 4: నగరంలోని 34వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు బీజేపీకి రాజీనామా చేసి, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ అగ్రనేతల వైఖరితో ఆ పార్టీ నిర్వీర్యమైతున్నదన్నారు. త్వరలోనే ఆ పార్టీ ముఖ్యనేతలు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దు

- గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

చిగురుమామిడి, అక్టోబర్ 4: సీఎం కేసీఆర్ నేతృత్వంలో గిరిజనులు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్, మండలంలోని జిల్లెలగడ్డ గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభోత్సవం, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు బుధవారం ఆమె ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ఆరున్నర దశాబ్దాల కాంగ్రెస్, టీడీపీ పాలనలో గిరిజన తండాలను, గిరిజనుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ వచ్చాక గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణానికి సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు కేటాయించారని, 500 జనాభా ఉన్న ప్రతి గిరిజనతండాను గ్రామ పంచాయతీగా మార్చినట్లు తెలిపారు. అర్హులైన గిరిజనులందరికీ ఆసరా పింఛన్లు అందుతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో త్వరలోనే సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను, హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడంలో గిరిజనులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో రోడ్లు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 15 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అక్కన్నపేట మండలానికి మంజూరైన గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి త్వరలోనే ఏడెకరాల స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.



బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

# అవ్వా.. ఎట్లున్నరే

‘అవ్వా ఎట్లున్నరే. మీ పాణం ఎట్లున్నదే’ అంటూ మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వృద్ధులను ఆత్మీయంగా పలుకరించారు. బుధవారం అభివృద్ధి పనుల ప్రారంభానికి తిమ్మాపూర్ మండలం గొల్లపల్లికి వచ్చిన ఆయన, అక్కడే వృద్ధులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలు తెలుసుకోగా.. ‘కేసీఆర్ సార్.. మీరుండగా మాకేం రందీలేదు’ అంటూ వృద్ధులు చెప్పారు.

- తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 4



వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

# తెలంగాణ ఆత్మగౌరవ పండుగ బతుకమ్మ

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మహిళలకు బతుకమ్మ చీరెల పంపిణీ

గంగాధర, అక్టోబర్ 4: రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవ పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన బతుకమ్మ చీరెలను బుధవారం మండలంలోని కురిక్యాల శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఆయన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళలు సంతోషంగా పండుగను జరుపుకోవాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతి సంవత్సరం మహిళలకు బతుకమ్మ చీరెలను అందజేస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ చీరెల తయారీతో చేనేత కార్మికుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. మహిళలు సంతోషంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లోకిని ఎల్లయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచ్ వేముల దామోదర్, ఆకుల శంకరయ్య, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు వేముల అంజి, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి సురేందర్, పంజాల ఆంజనేయులు, సుంకె అనిల్, ఇరుగురాల రవి, పెంచాల చందు, సముద్రాల అజయ్, ఎండీ అబ్బాస్, గంగాధర వేణు, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు సర్కారు కానుక బతుకమ్మ చీరెలు



బతుకమ్మ చీరెలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు

కొత్తపల్లి, అక్టోబర్ 4: ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ కానుకగా సీఎం కేసీఆర్ చీరెలను అందిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, గున్నాల విజయ-రమేశ్, గండు రాంబాబు, చింతల సత్యనారాయణరెడ్డి, వేముల కవితాశేఖర్, కోఆప్షన్ సభ్యులు ఎండీ పక్రుద్దీన్, శెట్టిపల్లి ప్రభాకర్, ఎస్‌కే షహనాజ్ మునావర్ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా టీఎన్జీవో నాయకులు



పీఆర్సీ కమిషన్ చైర్మన్‌తో టీఎన్జీవో కేంద్ర, జిల్లా సంఘం నాయకులు

కొత్తపల్లి, అక్టోబర్ 4: పీఆర్సీ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ శివశంకర్‌ను హైదరాబాద్‌లో జిల్లా టీఎన్జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఐఆర్‌పై విన్నవించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు కలిసి పలు సమస్యలను విన్నవించారు. వారి వెంట టీఎన్జీవోస్ కరీంనగర్ రూరల్ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్ సింగ్ ఉన్నారు.